క్లుప్తంగా

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



నెహ్రూనగర్: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఏటీ అగ్రహారం 8వ లైనులో గల అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు.

రేపు 'గంగలో విష నాగులు' పుస్తకావిష్కరణ

గుంటూరు వెస్ట్: బ్రాడీపేట ఒకటో లైనులోని బ్రాహ్మణ సమితిలో ఆదివారం ఉదయం 9:30గంటలకు గంగలో విషనాగులు అనే ఆంగ్ల పుస్తక తెలుగు అనువాదాన్ని మాజీ డీజీపీ అరవిందరావు ఆవిష్కరిస్తారని థింక్ సంస్థ నిర్వాహకులు డి.ఎస్.ఆర్. మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తక రచయిత సారంగపాణి, ఎం.సుధామోహన్, సీనియర్ జర్నలిస్టు సీహెచ్. సాయి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆధునిక భారతావని ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై ప్రముఖుల ఉపన్యాసాలుంటాయని ఆయన తెలియజేశారు.

సైదారెడ్డి భౌతికాయానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నివాళి

గుంటూరు మెడికల్: బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది కాయితీ సైదారెడ్డి భౌతికకాయాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం గుంటూరులో సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఆయనతోపాటు బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, నేతలు తాళ్లూరి శ్రీనివాస్, చందు సాంబశివరావు, జూపూడి రంగరాజు, వనమా పూర్ణచంద్రరావు, వెలగలేటి గంగాధర్, ఆర్ఎస్ఎస్ నాయకులు, అఖిల భారత విద్యార్థి పరిషత్ నేతలు నివాళులు అర్పించారు

ఇద్దరు వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: ఇద్దరు వ్యభిచార నిర్వాహకుల్ని అరండల్పేట పోలీసులు అరెస్టు చేశారు. అరండల్పేటలోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న గురుప్రసాదరావు, గోపీచంద్లను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

వ్యక్తిపై దాడి

ముగ్గురు సోదరులు కలసి సమీప బంధువుపై దాడి చేసిన ఘటనపై అరండల్పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్గాంధీనగర్ పదో లైనులో శివానాయక్ నివాసం ఉంటున్నాడు. బంధువుల మధ్య ఏర్పడిన మనస్పర్ధల కారణంగా అతడిపై సమీప బంధువులు శ్రీనునాయక్, బాలునాయక్, నాగునాయక్ కలసి శుక్రవారం దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మేదరబజారుకు చెందిన బండారు సురేష్తో 12 సంవత్సరాల కిందట సంతోషి (32)కి వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె గురువారం అర్ధరాత్రి గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

ఇంట్లో చోరీపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్రావు వీధికి చెందిన వి.పద్మజకుమారి కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల కిందట ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లింది. శుక్రవారం తిరిగి చేరుకుంది. లోపలకు వెళ్లి పరిశీలించగా, సందులో తలుపును దుండగులు బలవంతంగా తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు తెరిచి అందులోని రూ. లక్ష చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరల్డ్ టాప్ సైంటిస్ట్లలో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఏడుగురు అధ్యాపకులు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్లలో చోటు సాధించారని శుక్రవారం వైస్ చాన్స్లర్ పీ నాగభూషణ్ తెలిపారు. అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతంలోని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు అంబటి రంగారావు, కే చంద్రశేఖర్, పీలే అబ్రహం, కే వెంకటరావు, కే బాలమురుగన్, రుద్రపాల్ మిథున్, టీ సుబ్బయ్యలు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్లలో నిలిచారని తెలిపారు. స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ 2022 వరకు ఉన్న ఉత్తమ సైంటిస్ట్ల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్లో గల 22 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్ను పరిగణలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రొఫెసర్లను చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి రక్షణ

కార్పొరేటర్ల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



కార్పొరేటర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సీజనల్ వ్యాధుల వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా కార్పొరేటర్లు అవగాహన కలిగించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. తన చాంబర్లో శుక్రవారం కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం 'మీట్ ది కమిషనర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి రక్షణ లభిస్తుందని, వార్డు ప్రజలంతా వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలని కోరారు. కొన్నిచోట్ల వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు నిర్దేశిత సమయం విధుల్లో ఉండడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. శానిటరీ సూపర్వైజర్లు, ఎంహెచ్వో ఆకస్మిక పర్యటనలు చేసి, విధుల్లో లేని కార్యదర్శులపై చర్యలకు సిఫార్స్ చేయాలని ఆమె ఆదేశించారు. ఇప్పటి వరకు వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతుల్ని ఆదేశించారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించారు.

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కారానికి కృషి

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. వర్క్ అగ్రిమెంట్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. చాంబర్లో శుక్రవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కాంట్రాక్టర్లు అందించిన అర్జీలు, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, పరిష్కారం అయ్యాక వారికి తెలియజేయాలని అధికారుల్ని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజీల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు.

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా



ఇంజినీరింగ్ అధికారులతో కలసి దగ్గరుండి పనులు చేయిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 12వ వార్డు పరిధిలోని బర ఇమాంపంజా ప్రాంతంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమాతో కలసి పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వాటిని త్వరితగతిన అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే నగరపాలక సంస్థ అధికారులను పిలిపించి డ్రైయిన్ సమస్యకు పరిష్కారం చూపడంపై స్థానికుల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ పీవీకే భాస్కర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

గుంటూరు వెస్ట్: తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని, జాయింట్ కలెక్టర్ బి.రాజకుమారిని కలిశారు. తమ నియోజకవర్గంలో శ్రీనగర్, మొహమ్మద్ నగర్ ప్రాంతాల్లోని సర్వే నంబరు 711/1లో చేర్చిన అసైన్డ్ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. దీనికి సంబంధించి సుమారు 5.14 ఎకరాల భూమి ఉందని చెప్పారు. అధికారులు ఇద్దరు సానుకూలంగా స్పందించారని ఆమె పేర్కొన్నారు.

స్కూళ్లలో ముందస్తు దసరా సంబరాలు



కేఎల్పీ స్కూల్లో విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రథినీచౌదరి, ఉపాధ్యాయులు



పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో మహిషాసుర మర్దిని నృత్య రూపకం ప్రదర్శన



కెనడీ నెక్స్ జెన్ కిడ్స్ స్కూల్లో చిన్నారులు



కెనడీ మెరిట్ క్యాంపస్లో నవదుర్గల వేషధారణలో విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శుక్రవారం ముందస్తు దసరా వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ దసరా తెలుగువారి పెద్ద పండుగ అని, సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రతిబింబించేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ముందస్తు దసరా వేడుకల్లో విద్యార్థినులు అమ్మవార్ల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✦ అరండల్పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ మెరిట్ క్యాంపస్లో శుక్రవారం ముందస్తు దసరా వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీపూజిత స్కూల్లో విద్యార్థినులతో ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి, ఉపాధ్యాయులు



కన్న స్కూల్లో నవదుర్గల వేసధారణలోని విద్యార్థినులతో ఉపాధ్యాయులు

✦ రాజేంద్రనగర్లోని కెనడీ నెక్స్జెన్ కిడ్స్ స్కూల్లో చిన్నారులు నవదుర్గల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో దుర్గామాత శ్లోకాలు, గీతాలాపన గావించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎల్. హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ ఆర్టీసీ కాలనీలోని కన్న పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు దసరా వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా నవదుర్గల వేషధారణలతో విద్యార్థినుల 'మహిషాసుర మర్దిని' నృత్య గీతం సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. ఈ సందర్భంగా కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పండుగలు పెనవేసుకుపోయాయని చెప్పారు. చెడుపై మంచి విజయాన్ని సాధించడం, దశావతారాల ద్వారా ఆదిశక్తి జగన్మాతశక్తి స్వరూపిణిగా సమాజానికి మంచి సందేశాలను అందించడం దసరా పండుగ ప్రాముఖ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

✦ లక్ష్మీపురం మెయిన్రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం ముందస్తు దసరా వేడుకల్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల వేదికపై ఏర్పాటు చేసిన కనక దుర్గమ్మవారి నమూనా ఆలయంలో అమ్మవారి విగ్రహానికి కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు పూజల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో మహిషాసురుడిని వధిస్తూ, అయిగిరి నందిని పాటకు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటామని విష్ణువర్ధన్ పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాల్ని భావితరాలకు అందించాలనే ఆశయంతో పాఠశాలలో నిరంతరం పర్వదినాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు శేకూరులో బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమం

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



కొరిటెపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేబ్రోలు మండలం, శేకూరు గ్రామంలో బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే మానవీయ కోణంతో 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అనే సూక్తి స్ఫూర్తిగా నేత్ర జ్యోతి పేరుతో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని బజరంగ్ ఫౌండేషన్ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కారం చేసే కంటిచూపును తిరిగి పొందిన వారి కళ్లలో కనిపించే సంతృప్తి ముఖ్యమనిచ పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజలు అధికంగా ఉన్న చేబ్రోలు మండలంలోని శేకూరు, వీరనాయకునిపాలెం, పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి, తంగెళ్లమూడి గ్రామాల ప్రజలకు శేకూరు కేంద్రంగా నేత్ర జ్యోతి శిబిరాన్ని ఏర్పాటు చేయడం వెనుక జగనన్న సంక్షేమ స్ఫూర్తి దాగి ఉందన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ శిబిరం ద్వారా నేత్ర సమస్యల నుంచి యా గ్రామస్తులందరికీ రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి 7 రోజుల్లోగా కళ్ళజోళ్లను అందించడం జరుగుతుందని చెప్పారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి, ఈ సేవా పరంపర సత్ఫలితాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో లంక గ్రామాలు, తీర ప్రాంత గ్రామాల్లోని గంగపుత్రులు, మత్స్యకార కుటుంబాలే లక్ష్యంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు 8 వేల మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 5 వేల మందికి కళ్ళజోళ్లు అందించడం జరిగిందని వివరించారు. శేకూరు, పరిసర గ్రామాల ప్రజల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో కళ్ళజోళ్లు అవసరమైన వారికి కేవలం 7 పనిదినాలలో గ్రామంలోనే కళ్ళజోళ్ల పంపిణీ జరుగుతుందని వెల్లడించారు.

శరన్నవరాత్రుల ఉత్సవాలకు సన్నాహాలు



ఆర్. అగ్రహారంలోని ఆలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



గంటలమ్మ చెట్టు ఆలయంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు నరసింహారావు

పాత గుంటూరు: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అమ్మవార్ల దేవాలయాల్లో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో 161వ శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు తెలిపారు. 23న శ్రీ స్వర్ణ కవచ నిజరూప దర్శనం అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు శమీ పూజ జరుగుతుందని తెలిపారు. అనంతరం ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి తెల్లాకుల లక్ష్మీగురుప్రసాద్, కోశాధికారి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు సాతులూరి ప్రకాశరావు, ప్రోగ్రాం కన్వీనర్ డోగిపర్తి సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

▶ ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15నుంచి 23 వరకు శ్రీ మద్దేవీ నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నేరెళ్ల వెంకట హరిప్రసాదరావు, గౌరవాధ్యక్షుడు తాడికొండ లీలా వెంకట వీరాంజనేయులు తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

▶ ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్త సాయి సత్య దేవ మందిరంలో ఈనెల 15వ తేదీ నుంచి 23 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాళ్లబండి వెంకట సత్య రామాంజనేయ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, జగన్మాత అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన కోరారు.

ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అర్థశాస్త్ర అధ్యాపకుడు సుబ్బారెడ్డి

లక్ష్మీపురం: ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని, లేని పక్షంలో ప్రజల జీవితాలు మరింత దుర్భరంగా మారుతాయని సీనియర్ అర్థశాస్త్ర అధ్యాపకుడు సి.సుబ్బారెడ్డి తెలిపారు. అరండల్పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మేధావుల చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో ప్రజల నిజ ఆదాయాలు తగ్గుతున్నాయని తెలిపారు. కుటుంబ అవసరాలకు చేసే రుణాల వల్ల వారి పొదుపు మొత్తాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. వైద్య వ్యయంలో ప్రభుత్వాలు 53 శాతం మాత్రమే ఖర్చు చేస్తుండగా, ప్రజలు తమ జేబుల నుంచి 47శాతానికి పైగా భరించాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

జీజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ గురించి సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్కుమార్ సూచించారు. రోగులకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. స్వల్ప వ్యవధిలో శుక్రవారం ఉదయం ముగ్గురు మృతి చెందారని, వారిలో ఒకరు ఉదయం 9 గంటలకు, మరొకరు 9.30గంటలకు, ఇంకొకరు 10 గంటలకు మృతి చెందినట్లు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలు క్యాజువాల్టీ వద్ద ఉంచామని తెలిపారు. మృతదేహాల్ని 20 గంటలుగా క్యాజువాల్టీ వద్ద ఉంచామని ప్రచారం చేయడం అవాస్తమని ఆయన ఖండించారు. కేవలం ఎంఎల్సీ కేసుల్ని మాత్రమే మార్చురీకి తీసుకెళతారని వెల్లడించారు. నాన్ ఎంఎల్సీ కేసుల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహాప్రస్థానం ద్వారా వారి స్వస్థలాలకు మృతదేహాల్ని తరలిస్తున్నట్లు చెప్పారు. మృతదేహాల్ని తరలించలేదని చెప్పడం అవాస్తవమని పేర్కొన్నారు. జీజీహెచ్కు ప్రతిరోజూ 3వేల మందికి పైగా రోగులు వస్తున్నారని, వారికి వైద్యం అందించే విషయంలో ఎక్కడా రాజీపడకుండా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. కొంత మంది జీజీహెచ్పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. జీజీహెచ్లో రోగులకు అందుతున్న సేవల గురించి వారి సహాయకుల్ని అడిగితే పూర్తి వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు. రాజకీయం కోసం ఆసుపత్రిని అప్రతిష్ట పాలు చేయవద్దని కోరారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ ప్రభుత్వం భర్తీ చేసిందని, జీరో పాలసీ విధానంతో ప్రతినెలా ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకుండా భర్తీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కాణిపాకంలో చిరుమువ్వల సవ్వడి



కాణిపాకంలో నృత్య కారిణులతో నాట్యగురువు అను శేఖర్, ఆలయ ప్రతినిధి హరి

- వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- అద్భుతమైన నాట్యంతో ఆకట్టుకున్న గుంటూరుకు చెందిన విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఇటీవల ముగిసిన శ్రీవరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో గుంటూరుకు చెందిన నృత్యకారిణులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కాణిపాకంలో ఏటా వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాల్లో గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు కూచిపూడి నృత్యంలో అద్భుతమైన ప్రావీణ్యం గడించి ప్రదర్శనలు ఇస్తున్నారు. నగరంలో శ్రీనగర్ ఏడోలైనుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీకి చెందిన 20 మంది నృత్యకారిణుల బృందం ఈనెల 7న కాణిపాకంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చింది. నాట్య గురువు అను శేఖర్ పర్యవేక్షణలో కూచిపూడి నృత్యం, భక్తి గీతాలకు చేసిన నృత్యాలతో భక్తులు, ఆహుతులు మంత్ర ముగ్ధులయ్యారు. దేవ శ్రీగణేషా.. వచ్చెను అలిమేలుమంగ.. శ్రీనివాస కల్యాణం.. శివ, శివ శంకర హర హర శంకర దిగిరారా.. నవదుర్గ, కళింగ నాట్యంతో ఇచ్చిన అద్భుతమైన పెర్ఫార్మన్స్తో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పాల్గొన్న ఏకైక నృత్య బృందంగా అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్న నృత్య కారిణులను దేవస్థాన పాలకమండలి చైర్మన్ మోహన్రెడ్డి, ఆలయ అధికారులు అభినందనలతో ముంచెత్తారు. గత మూడేళ్లుగా ప్రతి యేటా బ్రహ్మోత్సవాల్లో ఇస్తున్న ప్రదర్శనలను ఇకపైనా కొనసాగించాలని ఆకాంక్షించారు. నృత్య కారిణుల బృందంలో టి.జ్ఞానితి, కె.శ్రీవైష్ణవి, కె.శ్రీవైభవి, ఎం.వెంకటరమణ, ఎం.స్వాతి, ఏ. పుణ్యవతి, రెడ్డి శ్రీకళ, లక్ష్మీ ప్రణతి, దివ్య, శాన్వి, లాస్య, భవ్య, సోనికా, సుస్మిత, హేమ, భోగ్యశ్రీ, పూజ్యశ్రీ, మాన్య, జాహ్నవి, యశస్విని ఉన్నారు.

శ్రద్ధగా ఆలకించడంతోనే భావవ్యక్తీకరణకు పునాది



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో అనిత, పూర్ణిమ, ఎస్వీ రమణ, లలిత

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో శ్రద్ధగా ఆలకించడమనేది భావవ్యక్తీకరణకు పునాది వంటిదని ఏఎన్యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి. అనిత పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్మెంట్ కళాశాలలో శుక్రవారం ఏఎన్యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంకామ్ ద్వితీయ సంవత్సర నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో డిస్టింక్షన్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది వసుమతి పూర్ణిమ తన తల్లి గడియారం ఇందిరాదేవి జ్ఞాపకార్థం స్మారక నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ గురువులు చెప్పిన అంశాల్ని శ్రద్ధగా ఆలకించి, వాటిని ఆచరణలో పెట్టడం ద్వారానే విద్యార్థి ప్రగతికి బాటలు పడతాయని తెలిపారు. వసుమది పూర్ణిమ మాట్లాడుతూ తన మాతృమూర్తి గడియారం ఇందిరాదేవికి విద్యా రంగంపై గల మక్కువను దృష్టిలో ఉంచుకుని, ప్రతి సెమిస్టర్లో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎంబీఏ విభాగంలో షేక్ రిజ్వానా, జి. లక్ష్మీసౌమ్య, ఈ.వంశీ, ఎంకామ్లో ఏ. వైష్ణవి, షేక్ రఫీ, పి. శ్రీవాణి నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. కార్యక్రమంలో హిందూ కాలేజీ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కళ్యాణి, సీహెచ్. వైష్ణవి, ఏ. బాజీబాబు, సీహెచ్. వేదవతి, మణికంఠ, అనిత, అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈనెల 15న సినీ సంగీత విభావరి, శ్రీకృష్ణ రాయబార పడక సీను నిర్వహించనున్నట్లు డాక్టర్ సి.వి.ఎస్. రామకృష్ణ, అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో కళాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.